# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 24, అక్టోబర్ 2026


# కొమురం భీమ్ కాంస్య విగ్రహావిష్కరణ

* ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
* సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలి: ఎమ్మెల్యే



**ఉట్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** గిరిజనుల హక్కుల పోరాట నిలయమైన ఇంద్రవెల్లి గడ్డపై ఆదివాసీ వీరుడు, జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజన హక్కుల కోసం పోరాడిన అమరయోధుడు కొమురం భీమ్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా ఆవిష్కరించారు. ఈ మహోత్సవానికి నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నుంచి ప్రారంభమైన భారీ పాదయాత్రలో వేలాది మంది ఆదివాసీ నాయకులు, ప్రజలు పాల్గొని ఉత్సాహంగా నడిచారు. ఆదివాసీ సంప్రదాయ డోలు వాయిద్యాలు, సంస్కృతిని ప్రతిబింబించే నృత్య రూపకాలతో మార్మోగుతుండగా పాదయాత్ర విగ్రహావిష్కరణ ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం కొమురం భీమ్ కాంస్య విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ఆవిష్కరించి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విగ్రహావిష్కరణ అనంతరం ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో ఆదివాసీ సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. ఈ రోజు మనందరికీ ఎంతో సంతోషకరమైన, గర్వకారణమైన రోజని పేర్కొన్నారు. మన హక్కుల కోసం, గిరిజన అస్తిత్వం కోసం గతంలో మన పూర్వీకులు, పెదవులు సాగించిన పోరాట స్ఫూర్తి నేటికీ ప్రతి ఒక్కరిలో రగిలిపోతుండాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా మనకు అందిన ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, మిగతా 2లో..



## ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్

# 86వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

* వర్ధంతి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు
* అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్

**కెరమెరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త** ఆదివాసీ హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి, జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాడిన ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతిని ఈ నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత, అన్నారు శుక్రవారం జోడేఘాట్ లోని కొమరం భీం మ్యూజియం సమావేశం మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవలక్ష్మి తో కలిసి అధికారులకు సూచించారు. కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, భక్తులు, ఆదివాసీ ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధం, రవాణా, భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కొమురం భీమ్ వర్ధంతికి పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అవాంఛనీయ మిగతా 2లో..

# పారదర్శకంగా జనాభా లెక్కింపు..

* అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
* సెన్సస్-2027 ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ జనాభా గణన-2027లో భాగంగా చేపట్టనున్న రెండో దశ జనాభా లెక్కింపు (ఫేజ్-2: పాపులేషన్ ఎన్యూమరేషన్)ను జిల్లా వ్యాప్తంగా అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక టీటీడీసీ సమావేశ మందిరంలో సబ్ డివిజన్ ఛార్జ్ స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన సెన్సస్-2027 ప్రత్యేక శిక్షణ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖిజనగణన నుంచి జనకల్యాణంఖి అనే ప్రధాన లక్ష్యంతో ఈ మహత్తర జనాభా గణన ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే వివిధ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజా అవసరాలకు అనుగుణమైన సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు ఈ జనాభా గణన ద్వారా సేకరించే ప్రామాణికమైన, ఖచ్చితమైన సమాచారమే ప్రధాన ఆధారంగా నిలుస్తుందన్నారు. జిల్లాలోని ప్రతి ఇల్లు, ప్రతి కుటుంబం, ప్రతి ఒక్క పౌరుడి వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గణన ప్రక్రియలో పారదర్శకతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ పద్ధతులు, యాప్ ద్వారా ఆన్‌లైన్ నమోదు విధానం, ఎదురయ్యే మిగతా 6లో..

# మెగా రక్తదాన శిబిరానికి అశేష స్పందన

* రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
* రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని కాపాడే భాగ్యం: జిల్లా ఎస్పీ



**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ప్రజలు, యువత నుండి అశేష స్పందన లభించింది. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం మరియు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఈ బృహత్తర సామాజిక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆదిలాబాద్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా రక్తదానం చేసి అధికారికంగా ప్రారంభించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజ రక్షణలో నిరంతరం భాగమయ్యే మిగతా 2లో..

## ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్

# 86వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలివర్ధంతి కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్యుత్, రవాణా, పారిశుద్ధ్య తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే కార్యక్రమ ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆదివాసీ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలిఆదివాసీ సమాజ హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ త్యాగం, ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని గౌరవప్రదంగా నిర్వహించాలని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి,



సంప్రదాయాలు, చరిత్రను పరిరక్షిస్తూ కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న కొమురం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు సూచించారు.

# చెన్నూర్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ అమలు చేయాలి

- సంతకాల సేకరణ చేపట్టిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



**చెన్నూర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

చెన్నూర్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం చెన్నూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బేతాళవాడ, పెద్ద అర్జునవాడ, నల్లగొండ పోచమ్మవాడల్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణమాచారి మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీలో పనులు దొరకక పేదలు కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తీసుకున్న అప్పులు తీర్చలేక, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మున్సిపాలిటీగా మారిన తర్వాత తొలగించారని పేర్కొన్నారు. పేదలు అధికంగా ఉన్న చెన్నూర్ మున్సిపాలిటీలోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతుండగా, మరోవైపు పేదలకు అందాల్సిన ఉపాధి హామీ బడ్జెట్‌లో కోతలు విధించడం అన్యాయమని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీలు ఇస్తూ, పేదలపై వివిధ పన్నుల భారం మోపుతున్నారని ఆరోపించారు. ఈ నెల 26న చెన్నూర్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భోగే సత్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సామల ఉమారాణి, భూపెల్లి మణి, నాగజ్యోతి, జక్కుల మారన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ కాంస్య విగ్రహావిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

ఆచారాలను ఎప్పటికీ మర్చిపోకూడదని ఉద్ఘాటించారు. మన జల, జంగల్, జమీన్ హక్కులను కాపాడుకుంటూ, మన విశిష్ట సంస్కృతిని భావితరాలకు సగర్వంగా అందించాల్సిన గురుతర బాధ్యత ఆదివాసీ సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మహారాష్ట్ర కేలాపూర్ శాసనసభ్యులు, జిల్లా సార్మేడీలు, ఆదివాసీ రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజానుకూల పోలీసింగ్‌పై వ్యాసరచన పోటీలు

- అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా పోలీసు సిబ్బందికి పోటీలు

**మంచిర్యాల, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యం, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధత పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు ఒక విభాగంలో, ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులకు మరో విభాగంలో పోటీలు ఏర్పాటు చేశారు. ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, సామాజిక మాధ్యమాల వినియోగం, ప్రజల గౌరవాభిమానాలు పొందే మార్గాలు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతం వంటి అంశాలను కేటాయించారు. పాల్గొన్న సిబ్బంది తెలుగు లేదా ఆంగ్ల భాషలో వ్యాసాలు రాసే అవకాశం కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు పోలీసుల్లో జవాబుదారీతనం, ప్రజానుకూల దృక్పథం, వృత్తిపరమైన నిబద్ధతను పెంపొందిస్తాయని అధికారులు తెలిపారు.

# మెగా రక్తదాన శిబిరానికి అశేష స్పందన

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు శాఖ, సామాజిక బాధ్యతలను నెరవేర్చడంలోనూ ఎప్పుడూ ముందే ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్వయంగా నిరూపించారు. ఈ రక్తదాన శిబిరానికి జిల్లాలోని వివిధ మండలాల నుండి, గ్రామాల నుండి విశేష స్పందన వ్యక్తమైంది. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వివిధ గ్రామాల ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రక్తదానం అనేది అత్యంత పవిత్రమైన కార్యమని, మనం ఇచ్చే ఒక యూనిట్ రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు ఈ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని రోడ్డు ప్రమాద బాధితులకు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్న పిల్లలకు మరియు అత్యవసర వైద్య సహాయం అవసరమయ్యే నిరుపేద రోగులకు ఉచితంగా అందజేసేందుకు ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌కు సురక్షితంగా తరలించారు. స్వచ్ఛగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన దాతలందరికీ పోలీసు శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) అందజేశారు. ప్రజా సేవలోనే కాకుండా ఇలాంటి బృహత్తర సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆదిలాబాద్ పోలీసులు ఆదర్శంగా నిలవడం పట్ల జిల్లా ప్రజల నుండి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మోనిక, డీఎస్పీ జీవన్ రెడ్డి, పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల పనులకు శాఖల మధ్య సమన్వయం అవసరం: కమిషనర్ హనుమంత రావు

- బాసరలో పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్ భవేశ్ మిశ్రా

- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన అన్ని రకాల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను స్పష్టంగా ఆదేశించారు. పుష్కరాల వంటి బృహత్తర వేడుకను విజయవంతం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సంపూర్ణ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన బాసర పుణ్యక్షేత్రంలో రూపుదిద్దుకుంటున్న పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని, నిర్మాణ డిజైన్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పుష్కరాల సమయంలో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం బాసరకు తరలివస్తారని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా ఘాట్లను విశాలంగా, భద్రతా ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. క్షేత్రస్థాయికి వచ్చే భక్తులకు ఎలాంటి చిన్నపాటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, శానిటేషన్, విద్యుత్ వెలుగులు, రోడ్లు, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. బాసర పుష్కర పనులపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ ఉంచుతోందని తెలిపారు. వారానికి ఒకసారి అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనులను పరుగులు తీస్తున్నామని, నిర్దేశిత గడువులోగా పనులన్నీ సంపూర్ణంగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమానికి ముందు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, కలెక్టర్ భవేశ్ మిశ్రాలు బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల

**బోథ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 87 పోస్టుల భర్తీ - ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం**

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వ మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బోథ్ ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్, అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి అధికారిక నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాల్లో మొత్తం 31 అంగన్వాడీ టీచర్, 56 అంగన్వాడీ హెల్పర్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. మండలాల వారీగా ఖాళీల వివరాలు పరిశీలిస్తే.. బజార్ హత్నూర్‌లో అంగన్వాడీ టీచర్ 06, హెల్పర్ 11, బోథ్‌లో అంగన్వాడీ టీచర్ 05, హెల్పర్ 05, సోనాలాలో అంగన్వాడీ టీచర్ 03, హెల్పర్ 07, ఇచ్చోడలో అంగన్వాడీ టీచర్ 10, హెల్పర్ 15, సిరికొండలో అంగన్వాడీ టీచర్ 02, హెల్పర్ 03, నేరడిగొండ మండలంలో అంగన్వాడీ టీచర్ 05, హెల్పర్ 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు జులై 1, 2026 నాటికి 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని అధికారులు తెలిపారు. సాక్షం అంగన్వాడీ, పోషణ 2.0 మార్గదర్శకాల ప్రకారం విద్యార్హతలకు సంబంధించి అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అయితే, హెల్పర్ పోస్టులకు ఇంటర్మీడియట్ అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో పదో తరగతి (ఎస్.ఎస్.సి) ఉత్తీర్ణులైన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు తప్పనిసరిగా స్థానిక వివాహిత మహిళలై ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామపంచాయతీ నివాసిగా, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత వార్డు నివాసిగా ఉండాలని స్పష్టం చేశారు. దివ్యాంగుల కోటా కింద దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వ జీఓ నెం. 39 ప్రకారం సదరమ్ సర్టిఫికెట్ ఆధారంగా సదరు వైకల్య శాతాన్ని బట్టి నిబంధనల ప్రకారం అర్హత వర్తిస్తుంది. అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు ఖచ్చితమైన కేంద్రాల వివరాలు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు కొరకు శోధించి, అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 05:00 గంటల వరకు గడువు ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఎస్ఎస్సి మెమో, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, మీసేవ కుల ధ్రువీకరణ, తాజా నివాస ధ్రువీకరణ (2026), ఆధార కార్డు, ఫోటో, సంతకం, దివ్యాంగులైతే సదరమ్ సర్టిఫికెట్ హార్డ్ కాపీలను ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 12:00 గంటలలోగా బోథ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో (సీడీపీఓ) స్వయంగా అందజేయాల్సి ఉంటుంది.



## రాణాపూర్ తండాలో ఫైనాన్షియల్ సాచురేషన్ అవగాహన కార్యక్రమం

**- గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యం: ఎల్‌బీఎమ్ రామ్ గోపాల్**

**- సామాజిక భద్రతా బీమా పథకాలు, సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

దేశంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడికి బ్యాంకింగ్ సేవలతో పాటు ఆర్థిక స్వావలంబన అందుబాటులోకి తీసుకురావాలనే ఉన్నత లక్ష్యంతో చేపట్టిన దేశవ్యాప్త ఫైనాన్షియల్ సాచురేషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్మల్ గ్రామీణ మండలం రాణాపూర్ తండాలో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో చివరి వ్యక్తి వరకు బ్యాంకింగ్ సేవలు చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బ్యాంకింగ్ సౌకర్యాలు, పొదుపు పథకాలు, డిజిటల్ లావాదేవీల ప్రయోజనాలను వివరించారు. ఆర్బీఐ చేపడుతున్న ఈ ప్రచారంతో ఆర్థిక భద్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎంలు రాములు, శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సర్పంచ్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూరులో బీసీఏ కుల సంఘాల డిమాండ్

**- బీసీడీ కులాలను బీసీఏలో చేర్చే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి**

**- వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల పరంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన**

**ఉట్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

బీసీడీ గ్రూప్‌లో ఉన్న పెద్ద కులాలను బీసీఏ గ్రూప్‌లోకి చేర్చడం వల్ల ప్రాథమికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల పరంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ కుల సంఘాల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉట్నూరులోని ప్రెస్ క్లబ్‌లో బీసీఏ కులాలకు చెందిన నాయకులు బింగి వెంకటేష్, కాల్వ రవి, తన్నీరు సతీష్, బొడ్డు నరసయ్య, రాములు తదితరులు ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా బీసీఏ వర్గాలకు దక్కాల్సిన 7 శాతం రిజర్వేషన్ ఫలాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బీసీడీ జాబితాలో ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న పెద్ద కులాలను తీసుకొచ్చి బీసీఏ వర్గంలో చేరిస్తే, ఇక్కడ ఉన్న సాంప్రదాయ కులవృత్తుల వారు, నిరుపేద చిన్న కులాల వారు తీవ్రంగా నష్టపోతారని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆయా పెద్ద కులాల పోటీని తట్టుకుని బీసీఏ వర్గాలకు చెందిన పేద పిల్లలు నిలదొక్కుకోవడం అత్యంత కష్టతరంగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీడీ కులాలను బీసీఏ వర్గంలో విలీనం చేసే లేదా చేర్చే ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. బీసీఏ వర్గాల హక్కులను పరిరక్షిస్తూ, వారికి దక్కాల్సిన రిజర్వేషన్లను కాపాడి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీఏ కుల సంఘాల నాయకులు బి.మల్లేష్, రాచకొండ ప్రవీణ్, పందిరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన

**కాగజ్‌నగర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో మెరుగైన దిగుబడులు సాధించేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం అరెగూడ గ్రామంలో రాశి కంపెనీ ఏరియా మేనేజర్ ఐలయ్య ఆధ్వర్యంలో పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాటన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసిన రైతుల చేలలను సందర్శించారు. సాధారణ పద్ధతిలో సాగు చేసిన పత్తి చేనుతో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన చేను మధ్య తేడాలను పరిశీలించారు. పంట నిర్వహణ, పురుగుల నివారణ, దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మనోహర్ మాట్లాడుతూ కాటన్ మిషన్ కార్యక్రమం కింద ప్రభుత్వం అందించిన పురుగుమందులను సూచించిన విధంగా వినియోగించాలని తెలిపారు. పంటపై పురుగుల ప్రభావాన్ని గమనిస్తూ అవసరమైన సలహాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని అన్నారు. రాశి కంపెనీ ఏరియా మేనేజర్ ఐలయ్య మాట్లాడుతూ పత్తి సాగులో సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతుల అభివృద్ధికి కంపెనీ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పద్మ, వసంతరావు, ఏఈఓలు రెహమాన్, శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్‌కె.హరిత**

**కెరమెరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలం నాగపూర్ గ్రామంలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో గెట్టు పంచాయితీలు, భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు మండలానికి 2 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సర్వేలో వినియోగించే రోవర్లను తెప్పించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావిడే తులసి రామ్ అనుముల శంకర్ సర్వేర్ రమేష్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ శ్రావణ్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా ఆయుష్ శాఖలో 8 పోస్టుల భర్తీ

**- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఖాళీల నియామకం**

**- ఈ నెల 26 నుండి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ: జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నారాయణ రావు**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

జాతీయ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎమ్)లో భాగంగా నిర్మల్ జిల్లాలోని ఆయుష్ శాఖలో ఖాళీగా ఉన్న 8 వివిధ రకాల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తూ జిల్లా ఆయుష్ శాఖ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఆయుష్ సంచాలకుల ఉత్తర్వులు (డి.ఓ.నెంబర్ 3013243/ఎన్.ఏ.ఎం/2025 హెచ్.ఆర్, తేదీ: 2109 2026) అనుసరించి ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ ఏ. నారాయణ రావు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో పీజీ అర్హత కలిగిన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 1, సాధారణ ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 2, డైటీషియన్ 1, సైకోసోషల్ కౌన్సిలర్ (ఆన్ కాల్) 1, యోగా ప్రొఫెషనల్ 1, మల్టీ పర్పస్ వర్కర్ 2 పోస్టులు ఉన్నాయి. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు దరఖాస్తు ఫారం కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ నుండి ప్రారంభం కానుంది. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి చేసిన దరఖాస్తు పత్రాలను సంబంధిత విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో జతచేసి, ఈ నెల 31వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల మధ్య నిర్మల్ కలెక్టరేట్ (ఐడీఓసీ) కాంప్లెక్స్‌లోని ఎఫ్25 బ్లాక్‌లో ఉన్న జిల్లా ఆయుష్ అధికారి కార్యాలయంలో ప్రత్యక్షంగా అందజేయాల్సి ఉంటుంది. 31వ తేదీ సాయంత్రం 4 గంటల ముగింపు సమయం తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించేది లేదని, పోస్టల్ జాప్యానికి తమ శాఖ ఎలాంటి బాధ్యత వహించదని స్పష్టం చేశారు. అలాగే అనివార్య కారణాల వల్ల ఈ నోటిఫికేషన్‌ను సవరించే లేదా రద్దు చేసే సర్వాధికారాలు జిల్లా నియామక కమిటీకి ఉంటాయని అధికారులు వెల్లడించారు.

# రబీలో ఆరుతడి పంటల సాగుకు పెద్దపీట

**- ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం.. ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలి**

**- రైతులకు మార్కెటింగ్, మద్దతు ధరలో ఇబ్బందులు లేకుండా చూడాలి: కలెక్టర్ రాజర్షి షా**

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

రాబోయే రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని, నీటి లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు అయ్యే ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ సీజన్ సాగు కార్యాచరణ, వాతావరణ పరిస్థితులు మరియు ప్రత్యామ్నాయ పంటలపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ సుదీర్ఘంగా మాట్లాడారు.




భవిష్యత్తు నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, ఆధునిక సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత మార్కెటింగ్‌లో ఎలాంటి చిన్నపాటి ఇబ్బందులు కూడా తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధరల కల్పనలో ఎలాంటి జాప్యం జరగడానికి వీల్లేదన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి రబీ సీజన్ ప్రారంభం నుంచే కొనుగోళ్లు సజావుగా జరిగేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రతి రైతు పండించిన చివరి గింజ వరకు సరైన మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, బార్దాన్ (గోనె సంచులు) తదితర ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డుల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు సకాలంలో పంట విక్రయాల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, గోనె సంచులు వంటి ప్రాథమిక సదుపాయాలకు లోటు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర లభించేలా మార్కెట్ కమిటీ సంపూర్ణంగా సహకరిస్తుందని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏడీ మార్కెటింగ్ అధికారి గజానన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**




ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, సీఈఓ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట అంబేద్కర్ చౌరస్తాలో వివిధ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఈఓ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలగకుండా ప్రజల హక్కులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని నాయకులు అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె. రాజేందర్, జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, జిల్లా ఉపాధ్యక్షులు పెరక శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికానంద్, రాజ్‌కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా నాయకులు సతీష్‌తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడెల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

**కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లింపు - ఎమ్మెల్సీ రమణను శాలువాతో సన్మానించిన ఆలయ అర్చకులు**



**సారంగాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అడెల్లి మహా పోచమ్మ అమ్మవారిని శుక్రవారం బిఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) ఎల్. రమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ ఎమ్మెల్సీ ఎల్. రమణకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, అమ్మవారి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కె. రామ్ కిషన్ రెడ్డి, రిటైర్డ్ ఎంవిఐ అజయ్, బిఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, మోతేవార్ లక్ష్మణ్, వంగ చంద్రశేఖర్ రెడ్డి, ధనుంజయ్, మామడ కన్వీనర్ చంద్రశేఖర్ గౌడ్, కయ్యూమ్ ఖాన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాలాచారి

**- కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా**

**- ఆర్థికంగా, సామాజికంగా ఆదుకుంటామని హామీ**

**సారంగాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామంలో శుక్రవారం మాజీ కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ వేణుగోపాలాచారి పర్యటించారు. గ్రామానికి చెందిన కోర్వ భోజవ్వ గత 15 రోజుల క్రితం మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఆయన జాం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను నేరుగా పరామర్శించారు. భోజవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలోని కార్యకర్తలకు, వారి కుటుంబాలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భోజవ్వ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఏ అవసరం వచ్చినా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కోర్వ నవీన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏంబడి రాజేశ్వర్, ఎన్ఎస్ యూఐ నాయకుడు ఏంబడి రాకేష్, నాయకులు కోర్వ రాము, కూన మహేష్, గడ్డల మహేష్‌లతో పాటు పలువురు స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులు ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొందాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ ప్రాథమిక సహకార సంఘం లిమిటెడ్‌లో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు అలీ బిన్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు రైతులకు ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొందడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ తమ సహకార సంఘాన్ని ఎఫ్‌పీఓగా గుర్తించినందుకు రైతుల తరఫున సంబంధిత అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘంలోని ప్రతి డైరెక్టర్ కనీసం 50 మంది రైతులను సభ్యులుగా చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. రైతులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఎఫ్‌పీఓ ద్వారా కలిగే ప్రయోజనాలను పొందాలని కోరారు. ఎఫ్‌పీఓ డీఈ రాథోడ్ శ్రీధర్ మాట్లాడుతూ రైతులందరూ ఎఫ్‌పీఓలో సభ్యులుగా చేరి సంస్థ ద్వారా అందే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు రూ.2000 చెల్లించి సభ్యత్వం పొందాలని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి, వ్యవసాయ రంగంలో సమష్టి కృషికి ఎఫ్‌పీఓలు దోహదపడతాయని వివరించారు. సంఘం వైస్ చైర్మన్ రుకుమ్ ప్రహ్లాద్ మాట్లాడుతూ ప్రతి రైతు రూ.2000 వాటాధనం చెల్లిస్తే ఎన్‌సీడీసీ ద్వారా అదనంగా రూ.2000 వాటాధనాన్ని వారి పేరుపై సంఘంలో జమ చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగ నారాయణ, డీసీఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్పెషల్ ఆఫీసర్ షాముల్, డైరెక్టర్లు నారా ఆశన్న, బల్లారపు మధుకర్, రైతులు మిట్టా తిరుపతి, ధర్మయ్య, వాంకిడి సంఘం కార్యదర్శి ఓ మాజీ, రెబ్బెన సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## 11వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం సమ్మె

**ఆసిఫాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**

కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిరక్ష్య వైఖరిని ఎండగడుతూ ప్రతిరోజూ ఒక కొత్త రీతిలో ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. నిరసనలో భాగంగా ఒంటి కాలుపై నిలబడి వినూత్న ప్రదర్శన చేశారు. సమ్మె శిబిరం వద్ద అధిక సంఖ్యలో ఎన్హెచ్ఎం ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, సామూహికంగా ఒంటి కాలుపై నిలబడి తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేశారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మా బతుకులు మారాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పలు నినాదాలతో హోరెత్తించారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేసిన తమను ప్రభుత్వం గాలికి వదిలేయడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ వినూత్న నిరసనలో ఆర్బీఎస్కే, ఆయుష్ డాక్టర్లు, ఎంఎల్హెచ్పిలు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, సెకండ్ ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :**



ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం లక్ష్యంగా నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న "ఓట్ బచావో - దేశ్ బచావో" బహిరంగ సభను విజయవంతం చేయాలని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ శుక్రవారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వాల ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్ సమావేశంలో పాల్గొన్న నాయకులు, ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన బీఎల్ఏలకు ధన్యవాదాలు తెలిపారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 1న ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 10 వేల మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కొమురం భీం జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి సుమారు 100 మంది చొప్పున బీఎల్ఏలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేలా నాయకులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని ఆమె అన్నారు

## శ్రీరాంపూర్ బీసీ లైజన్ ఆఫీసర్‌గా కృష్ణ ప్రసాద్ నియామకం

### శుభాకాంక్షలు తెలిపిన బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్‌గా నియమితులైన ఎస్వోటు జీఎం కృష్ణ ప్రసాద్‌కు బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ తరపున నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ నాయకులు శ్రీనివాస్, మారుతి, బద్రి బుచ్చయ్యలు మాట్లాడుతూ... శ్రీరాంపూర్ ఏరియాలోని బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృష్ణ ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఆయన సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో బీసీ ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో పారదర్శకంగా నియామక ప్రక్రియ

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కొరకు నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పి.జి. మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పి.జి. మార్కులకు నిర్దేశించిన వెయిటేజీని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్‌ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు.



ఎంపికైన అభ్యర్థి త్వరలో విధులలో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, త్రాగునీటిసదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

**హాజీపూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం, దేశ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గుడిపేటలోని 13వ బెటాలియన్ ప్రాంగణంలో శుక్రవారం కమాండెంట్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో దేశం కోసం అమరులైన పోలీసు వీరుల చిత్రపటాలకుపూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. విధి నిర్వహణలో వారు చూపిన ధైర్యసాహసాలను, చేసిన అత్యున్నత త్యాగాలను ఈ సందర్భంగాస్మరించుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానం యొక్క ఆవశ్యకతను వివరించారు. ఆపదలో ఉన్న తోటి మనిషిని కాపాడేందుకు రక్తదానం చేయడమే ఉత్తమ మార్గం. మనం చేసే ఒక్క రక్తదానం మరో ముగ్గురి ప్రాణాలను నిలబెట్టగలదు. పోలీస్ సిబ్బంది విధినిర్వహణలోనే కాకుండా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి ప్రాణదాతలుగా నిలవడం గర్వకారణంగ అని సిబ్బందిలో స్ఫూర్తి నింపారు. ఈ రక్తదాన శిబిరానికి రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా జనరల్ సెక్రటరీ మహేందర్ రెడ్డి, తలస్సేమియా సికిల్ సెల్ విభాగం ఇన్‌ఛార్జ్ కాసర్ల శ్రీనివాస్ పాల్గొని రక్త సేకరణను పర్యవేక్షించారు. తలస్సేమియా, సికిల్ సెల్ వంటి దీర్ఘకాలిక రక్త రుగ్మతలతో బాధపడే చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, ఇలాంటి రక్తదాన శిబిరాలు ఆ చిన్నారుల పాలిట సంజీవనిగా మారతాయని వారు తెలిపారు. రక్తదానం పట్ల ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల శరీరానికి సైతం ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.

యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో వైద్య బృందం రక్తదాతలకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రక్తాన్ని సేకరించింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఆంజనేయ రెడ్డి, వీర రాజు, వీరన్నలతో పాటు ఇతర పోలీస్ అధికారులు, బెటాలియన్ జవాన్లు, సిబ్బంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

### - విజయదశమి శుభాకాంక్షలు తెలిపి ఘన సన్మానం

**నస్పూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా ఈ సందర్భంగా వారు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, పార్టీ నాయకులు కోదూరి విజయ్, అంజి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 27న ఉచిత నేత్ర వైద్యశిబిరం

### - వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఐ బన్సీలాల్

**చెన్నూర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



ప్రజాసేవే లక్ష్యంగా చెన్నూర్ లయన్స్ క్లబ్ విశేష సేవలు అందిస్తోందని చెన్నూర్ పట్టణ సీఐ బాన్సీలాల్ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ చెన్నూర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా నేత్ర వైద్య సేవలు అందించేందుకు శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ మంగళవారం చెన్నూర్‌లోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూర్ అధ్యక్షుడు నిమ్మల సాగర్, జోన్ చైర్‌పర్సన్ జాడి తిరుపతి, బొల్లంపల్లి నాగరాజా గౌడ్, పిప్పిరెడ్డి దీక్షిత్, ఎన్నం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ త్వరితగతిన న్యాయం చేయాలి

### మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ - శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ, రికార్డులు పరిశీలన

**నస్పూర్,అక్టోబర్ 23, ప్రభాతవార్త**



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల నిరంతర పర్యవేక్షణలో భాగంగా ఈ తనిఖీ చేపట్టారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీసీపీ, ఆవరణను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన ఆయన.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంపై దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అశోక్, ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బు, అహంకారంతో రాజకీయాలు చేస్తే చర్యలు తప్పవు

**లక్షెట్టిపేట, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



ప్రాణం ఉన్నంత వరకు ప్రేమ్ సాగర్ రావు తోనే ఉంటా అని ఆర్టిఏ సభ్యులు అంకతి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రోజున స్థానిక విశ్రాంతి భవనం ఆవరణలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, స్థానిక నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఊహించని రీతిలో నన్ను తప్పుదోవ పట్టించడమే కాకుండా రెండు రోజులుగా నన్ను, నా కుటుంబాన్ని మానసిక వేదన గురి చేశారు. రాజకీయ గురువు, చిన్న స్థాయి నుంచి జిల్లా స్థాయికి తీసుకువచ్చి నన్ను అభివృద్ధి చేసిన ఘనత ప్రేమ్ సాగర్ రావు కి దక్కుతుందని, నా ప్రాణం ఉన్నంతవరకు ప్రేమ్ సాగర్‌తోనే ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ, నాటకీయ పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. డబ్బు అహంకారంతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రేమ్ సాగర్ చేసిన అభివృద్ధి ఏంటో రాష్ట్రస్థాయిలో తెలుసు అన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి చేస్తూ ముందుకు కొనసాగుతూ ఉన్నాడే తప్ప ఎప్పుడు తప్పుడు ఆలోచనలు చేయలేదు. మీరు రోజు చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకుంటే మంచిదని, లేదంటే తగిన రీతిలో బుద్ధి చెప్తాం అన్నారు. గత రెండు రోజులుగా అంకతి శ్రీనివాసు ను ఇబ్బందులకు గురి చేసినందుకు గాను విశ్రాంతి భవనం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేయడం జరిగింది. వెంటనే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోకుంటే ఎంత స్థాయికి అయినా వెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, ఆర్జిపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, సీనియర్ నాయకులు పూర్ణచంద్రరావు, నాగభూషణం, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, మంచిర్యాల కమిటీ చైర్మన్ రమేష్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఖాలిద్, జిల్లా సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీఖండ్ మహాదేవ్ యాత్ర పూర్తి చేసిన కేదారికి ఘన సన్మానం

### - పట్టుదల, ధైర్యసాహసాలకు నిదర్శనం కేదారి యాత్ర

**మందమర్రి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



శ్రీఖండ్ మహాదేవ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన కాసిపేట-2 గని కార్మికుడు ఉయ్యాల కేదారిని తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. అత్యంత కఠినమైన పర్వత మార్గంలో సాగే పవిత్ర యాత్రను పూర్తి చేసుకుని వచ్చిన కేదారిని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీఖండ్ మహాదేవ్ యాత్ర భక్తిశ్రద్ధలతో పాటు ఎంతో పట్టుదల, ధైర్యసాహసాలు అవసరమయ్యే పవిత్ర యాత్ర అని పేర్కొన్నారు. కేదారి ఈ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతం రవికిరణ్, గాజుల సురేష్, రెమ్మ నిశాంత్, గెల్లీ మనోహర్, రెక్కల తిరుపతి, భూక్యా శ్రీనివాస్, కుదిరే శ్రీకాంత్, ఈర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కేదారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక యాత్రలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.



# నవంబర్ 1న బజార్‌హత్నూర్‌లో కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ

### - ప్రముఖులను ఆహ్వానించిన సాధన కమిటీ - నవంబర్ 1న విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో వచ్చే ఆదివారం, నవంబర్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన విప్లవ వీరుడు, గిరిజన పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కొమురం భీమ్ విగ్రహ సాధన కమిటీ సభ్యులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కమిటీ ప్రతినిధులు శుక్రవారం పలువురు జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని ఘనంగా ఆహ్వానించారు. సాధన కమిటీ ప్రతినిధులు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అలాగే మాజీ పార్లమెంటు సభ్యులు సోయం బాపురావులను ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి విశిష్ట అతిథులుగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కమిటీ ఆహ్వానంపై నాయకులు, అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతామని హామీ ఇచ్చారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో కొమురం భీమ్ విగ్రహ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం ఈశంరావు, ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్, వివిధ గ్రామాల సర్పంచులు పరస సాయన్న, తొడసం నాందేవ్, మేస్రం మాధవ్, సార్ మేడి ప్రతినిధులు తొడసం నాగోరావు, పెందుర్ ఈశ్వర్, కమిటీ ముఖ్య సభ్యులు ఉయికే సుదర్శన్, నైతం రమేష్, మేస్రం జంగుబాపు, మడావి బలిరాం, గెడాం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి పెద్దపీట.. అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు

### - ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలతో పంపిణీ కార్యక్రమం

### - లబ్ధిదారులకు కార్డులు అందజేసిన మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్

**వేమనపల్లి, అక్టోబర్ 23, ప్రభాతవార్త**



పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆర్. సంతోష్ కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు శుక్రవారం వేమనపల్లి మండలం నీల్వాయి రైతు వేదికలో తహసీల్దార్ నక్క సాయికృష్ణతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సహకారంతో మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుమారస్వామి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి మధు, సర్పంచులు అవులమారి పున్నం, కొట్రంగి శ్రీనివాస్, వుప్పులవు సాయికృష్ణ, ఏనుగంటి మల్లీశ్వరి శేఖర్ రెడ్డి, దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, మాజీ ఎంపీపీలు లింగా గౌడ్, కుర్రు వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా జనాభా లెక్కింపు..

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక అంశాలు మరియు గణన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మాస్టర్ ట్రెయినర్లు అధికారులకు ప్రత్యక్షంగా సమగ్ర అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో జనాభా గణన ప్రక్రియ నిరాటంకంగా, సజావుగా సాగేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జనాభా గణన ప్రాముఖ్యతను గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు విస్తృతంగా వివరించి, ప్రతి ఒక్కరూ సరైన సమాచారాన్ని అందిస్తూ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించేలా చైతన్యపరచాలని ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కృష్ణయ్య, డీఆర్వో స్రవంతి, సూపరింటెండెంట్ నలంద ప్రియ, మాస్టర్ ట్రెయినర్ వెంకటరమణ, వివిధ మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.